సత్యవేడువాసికి హైకోర్టు న్యాయమూర్తిగా అవకాశం



కుటుంబ సభ్యులతో చంద్రధనశేఖర్

సత్యవేడు, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తిగా సత్యవేడుకు చెందిన తూటా చంద్రధనశేఖర్‌ను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పని చేస్తున్నారు. న్యాయవాది చంద్రశేఖరన్, శైలజ దంపతుల కుమారుడు. 1 నుంచి 6వ తరగతి వరకు స్థానిక ముత్యాల్‌దాస్ ఎయిడెడ్ పాఠశాలలో, 7 నుంచి 10వ తరగతి వరకు సత్యవేడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. చెన్నైలోని ఎస్‌కేపీపీలో ఇంటర్, వివేకానంద కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. నెల్లూరులో లా చేశారు. 1999లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. సుమారు 23 ఏళ్లుగా హైకోర్టులోనే న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ న్యాయవాదిగా హైకోర్టులో సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సును కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదిస్తే ఆయన హైకోర్టు జడ్జిగా నియమితులవుతారు.

జిల్లాలో 40.43 మి.మీ. వర్షపాతం నమోదు: కలెక్టర్



తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సగటున 40.43 మి.మీ. ఏర్పేడు మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. మూడు రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు పడుతున్నాయని, యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని, ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ● జిల్లాలో చెరువులు తెగిపోవడం వంటి ఘటనలు జరిగితే ఎదుర్కొనేందుకు అవసరమైన ఐదువేల ఇసుక బస్తాలు, 50 టిప్పర్లను సిద్ధం చేశామన్నారు. ● కండలేరు జలాశయంలో 68 టీఎంసీలకు ప్రస్తుతం 33.15 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ● నారుమడులు దాదాపు 75 హెక్టార్లు, విత్తన వరిపంట సుమారు 2518 హెక్టార్లు నీటి మునిగాయన్నారు.

జడిపిస్తోన్న వాన

- ☛ జనజీవనం అస్తవ్యస్తం
- ☛ నేడు అతి భారీ వర్షాల సూచన
- ☛ అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ☛ విద్యా సంస్థలకు సెలవు

ఈనాడు-తిరుపతి: జిల్లా వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురిశాయి. ముఖ్యంగా జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, తిరుపతి నియోజకవర్గాల్లో ఎడతెరపి లేకుండా వర్షం పడింది. దీంతో పలు ప్రాంతాల్లో రహదారులు మునిగాయి. పలు కాలనీలు, గ్రామాల్లోని ఇళ్లలోకి నీరు చేరుకోవడంతో అధికారులు వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. పలు ప్రాంతాల్లోని కల్వర్టులపైకి నీరు రావడంతో రాకపోకలు నిలిపివేశారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండటంతో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లలేదు. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం వల్ల ఉమ్మడి జిల్లాలో అతి భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ప్రజలు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గురువారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.



తిరుపతి: లక్ష్మీపురం కూడలిలో వరద ప్రవాహం




తిరుమల శ్రీవారి ఆలయం వద్ద..



సముదాయం వద్ద అరుణానది ఉద్ధృతి



తిరుపతి: పూలవానిగుంటలో ఢిల్లీ బాబు ఇంట్లోకి చేరిన నీరు



శ్రీకాళహస్తిలో ముక్కంటి ఆలయం వద్ద స్వర్ణముఖి ప్రవాహం

మాల్వాడి గుండం.. మంత్రముగ్ధం



సప్తగిరులు జలసవ్వడి సంతరించుకున్నాయి. తిరుమల కొండల్లో పడిన వర్షంతో కపిలతీర్థం, మాల్వాడి గుండం జలపాతాలు ఉరకలెత్తుతున్నాయి. చక్కిలిగింతలు పెట్టే నీటి తుంపర్లు, హోరెత్తే జల పరవళ్లు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. రెండు ప్రాంతాల్లోనూ సందర్శకుల తాకిడి పెరగడం తోడు సెల్ఫీల సందడి కనిపిస్తోంది.

- న్యూస్‌టుడే, తిరుపతి (బైరాగిపట్టెడ)

■ పునరావాస కేంద్రాలకు తరలింపు

తిరుపతి, వాకాడు, తడ సూళ్లూరుపేట ప్రాంతాల్లో ముంపు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. బాధితులకు ఆహారం, నీటితోపాటు వైద్య సదుపాయాన్ని అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తిరుపతి కమిషన్ మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతోపాటు శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయిలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఇబ్బందులు తెలుసుకున్నారు. జిల్లాలోని 2,461 చెరువుల నీటి సామర్థ్యం 21.78 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.55 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో గండ్లు పడకుండా తగిన చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలను అందుబాటులో ఉంచుకున్నారు.

జలాశయాల్లో నీటిమట్టాలు ఇలా..

జలాశయం	పూర్తిస్థాయి (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
కాళంగి	0.24	0.078	1,388
అరణియార్	1.85	0.682	1,660



విన్నమాలలో మైక్‌లో అప్రమత్తం చేస్తూ..



గోవిందపల్లిపాళెం వద్ద సముద్రపు నీరు రాకుండా తవ్వకం

వరద ప్రాంతాల్లో ఆర్టీసీ సేవల కుదింపు

తిరుపతి (ఆర్టీసీ): పలు మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసింది. మరికొన్ని దారి మళ్లించింది. తిరుపతి- గుడిమల్లం సర్వీసును మిట్టమీదకండ్రిగ వరకు పరిమితం చేశారు. సూళ్లూరుపేట- కొరిడి, పేర్నాడు, వేనాడు, మిజూరు, శ్రీకాళహస్తి- పాలచ్చూరు సర్వీసులను రద్దు చేశారు. సత్యవేడు- శ్రీకాళహస్తి సర్వీసులను శ్రీకాళహస్తి నుంచి గోవర్ధనపురం వరకు, సత్యవేడు నుంచి వరదయ్యపాలెం వరకు పరిమితం చేశారు. తిరుమలలో పాపవినాశనం సర్వీసులను రద్దు చేశారు. వెంకటగిరి- శ్రీకాళహస్తి వయా ముచ్చువోలు సర్వీసును ఏర్పేడు మీదుగా మళ్లించారు.

పంట నష్టం (హెక్టార్లలో..)

- వరి - 2,913
- నర్సరీ - 76
- మొక్కజొన్న - 4
- మినుములు - 19

నిలిచిన రాకపోకలు

- ● నారాయణవనం మండలంలో అరుణానది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు ఆపారు.
- ● పాలచ్చూరు పులికాలువపైకి నీరు చేరుకోవడంతో రాకపోకలు సాగకుండా అధికారులు కంప వేశారు.
- ● ఓజిలి మండలం నెమళ్లపూడి-పున్నేపల్లి గ్రామాల మధ్య ఉన్న మామిడి కాలువపైకి నీరు చేరడంతో ఇరువైపులా రాకపోకలు సాగకుండా ఉండేందుకు సిబ్బందిని నియమించారు.
- ● తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు వాగు, కారాకొల్లు సమీపంలోని కాజ్‌వేలపై వరద చేరడంతో రెండు చోట్లా రాకపోకలు నిషేధించారు.
- ● తిరుమలకు వెళ్లే రెండో కనుమదారిలో కొండచరియలు విరిగిపడటంతో భక్తులకు కొంత ఇబ్బంది ఏర్పడింది.

సంక్షిప్తంగా..



పునరావాస కేంద్రాలు: 208



తరలించిన ప్రజల సంఖ్య: 1183



ముంపు ప్రాంతాలు: 52



పొంగిన వాగులు: 4



సమస్యాత్మక రహదారులు: 143



గుడిమల్లం వద్ద నేలకూలిన పరివర్తకం



పులికాట్ తీరంలో గ్రామాలను చుట్టుముట్టిన నీరు



దొరవారిసత్రం: ఏకొల్లులో పంటలో నీటిని బయటకు పంపుతున్న రైతులు



వెంకటగిరి : కైవల్య నది కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద



తిరుపతి : పూలవానిగుంటలో ఇంట్లోకి చేరిన వాన నీరు

మండలం..	ఏర్పేడు	పెళ్లకూరు	రేణిగుంట	శ్రీకాళహస్తి	వెంకటగిరి	దొరవారిసత్రం	తొట్టంబేడు	వడమాలపేట	నారాయణవనం	తిరుపతి అర్బన్	తిరుపతి గ్రామీణం	పుత్తూరు	చిల్లకూరు	డక్కిలి	సూళ్లూరుపేట	పిచ్చాటూరు	యర్రావారిపాలెం	బీఎన్ కండ్రిగ	చంద్రగిరి
వర్షపాతం(మి.మీ) ..	103.04	83.04	80.06	70.08	69.00	66.08	63.06	63.02	61.00	54.08	51.02	49.02	47.04	41.02	37.04	36.02	36.02	35.08	35.06

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ. 300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పట్టింది. మంగళవారం శ్రీవారిని 73,891 మంది దర్శించుకోగా రూ.3.53 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

టెట్‌కు 2,149 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ): జిల్లా వ్యాప్తంగా బుధవారం నాలుగు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు మొత్తం 2,149 మంది హాజరయ్యారు. ఉదయం 1,264 మందికిగాను 1,099 మంది, మధ్యాహ్నం 1,265 మందికిగాను 1,050 మంది హాజరయ్యారు.

నిండు గర్భిణి ఆసుపత్రికి తరలింపు



తడ పునరావాస కేంద్రంలో గర్భిణి కోట్లపాటి కుట్టితో అధికారులు

తడ, న్యూస్‌టుడే: తడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్న వారిలో ఓ నిండు గర్భిణి ఉండడాన్ని అధికారులు గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తడ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన కోట్లపాటి కుట్టికి తొమ్మిది నెలలు నిండాయి. ఆమెకు ఏ క్షణంలోనైనా పురిటి నొప్పులు వచ్చే అవకాశం ఉన్నందున ఇన్‌ఛార్జి తహసీల్దారు శరత్‌బాబు కారు సిద్ధం చేసి స్థానిక ఓబుల్‌రెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి కిషోర్‌ని సంప్రదించారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచారు.

● జిల్లావ్యాప్తంగా ఏడురోజుల్లో ప్రసవం కానున్న 59 మంది గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

మెట్ల దారిలో.. గట్ల పంచాయితీ

రాత్రికిరాత్రే వెలుస్తున్న దుకాణాలు ఘర్షణలకు తోడు పర్యావరణ సమస్యలు


పాపనాశనం జలాశయం వద్ద గతనెలలో ఏర్పాటు చేసిన అనధికార దుకాణం

తిరుమల నడకదారులు నిత్య ఘర్షణలకు వేదికగా మారుతున్నాయి. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గం పరిధిలో చిరుతలు, ఎలుగు బంట్ల సంచారం పెరగడం.. లక్షిత అనే చిన్నారిపై దాడి నేపథ్యంలో అక్కడి అనధికార దుకాణాలు తొలగించేందుకు తితిదే అధికారులు ఆరునెలల కిందట యత్నించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాటిని అలాగే కొనసాగించడంతో ప్రస్తుతం ఎవరికివారు నేతల పేరుచెప్పి రాత్రికిరాత్రి కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.

- న్యూస్‌టుడే, జీవకోన (తిరుపతి)

అనుచరుల కోసం పోటాపోటీగా..

తిరుమల పరిధిలోని పాపనాశనం జలాశయం, శ్రీవారిమెట్టు, అలిపిరిమెట్టు మార్గంలోని ఫారెస్టు మ్యూజియం పరిధిలో ఐదేళ్ల కిందట వైకాపా నాయకుల అండతో అనధికార దుకాణాలు పెద్దఎత్తున ఏర్పాటు చేసుకున్నారు. చంద్రగిరి, తిరుపతి నాయకులే కాకుండా, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దాయన చెందిన వ్యక్తులు.. ఎవరికివారుగా పోటీపడి మరీ వాటి ఏర్పాటులో అనుచరులకు అండగా నిలిచారు. పాపనాశనం పరిధిలో దుకాణాల ఏర్పాటుకు అప్పట్లో వైకాపా యువజన విభాగం నాయకులు పెద్దమొత్తంలో వసూళ్లకు తెగబడ్డారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు ఇలా..

- తాజాగా శ్రీవారిమెట్టు వద్ద ఉన్న దుకాణాల విషయమై వైకాపా, కూటమి నాయకులు, కార్యకర్తల మధ్య గొడవలు జరిగాయి. ఇక్కడ 50 వరకు దుకాణాలుండగా వాటిలో తితిదే లైసెన్సులున్నవి పది వరకు మాత్రమే. మిగిలినవి అనధికారంగా కొనసాగిస్తున్నారు.
- అలిపిరి నడక మార్గంలోని ఏడో మైలు వద్ద మరింత ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. ఇక్కడ వ్యాపారం రోజూ రూ.వేలల్లో జరుగుతుండటంతో అటవీశాఖకు సంబంధించిన భూమిలోనూ కొత్తగా దుకాణాల ఏర్పాటుకు యత్నిస్తున్నారు. ఇక్కడ చిన్నాపెద్ద కలిపి 200 పైగా ఉన్నాయి. వీటిలో అటవీశాఖ లైసెన్సులున్నవి 30, అనధికారికంగా మరో 30 ఉన్నాయి. మిగిలిన 140 దుకాణాల్లో సగం వాటికి తితిదే, ఎండోమెంట్ అనుమతులు ఉండగా మిగిలినవి అనధికారమే.
- పాపనాశనం వద్ద ఏళ్లుగా షికారీలు దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 40 దుకాణాలకు తితిదే, అటవీశాఖ అనుమతిచ్చింది. కొత్తగా మరో 37 మంది దుకాణాల కోసం సీసీఎఫ్‌కు వినతి సమర్పించారు.

స్పష్టమైన విధానాలేవీ?

నడకదారుల్లో వచ్చే భక్తులు నిత్యం 20 వేల నుంచి 30 వేల మంది వరకు ఉంటున్నారు. దీంతో అనధికార దుకాణాలు లెక్కకు మిక్కిలిగా ఏర్పాటవుతున్నాయి. ఇదే సమయంలో తినుబండారాలు ఇష్టారాజ్యంగా పడేస్తుండటంతో వాటి కోసం జంతువుల సంచారం సైతం పెరిగినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తితిదే, అటవీశాఖ అధికారులు వీటిపై ఓ విధానపరమైన నిర్ణయం తీసుకుని దుకాణాల ఏర్పాటుపై పరిమితులు విధించడంతోపాటు నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాల్సిన అవసరం ఉంది.

- సమస్యపై అటవీశాఖ ఇన్‌ఛార్జి సీసీఎఫ్ సెల్వం స్పందిస్తూ.. అటవీ ప్రదేశాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలపై మరోమారు విచారణ చేయించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

పీహెచ్‌సీల్లోనే గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు

కేంద్ర సహకారంతో సేవల విస్తరణ | అనుసంధానంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు | ఉమ్మడి జిల్లాలో రూ.8 కోట్లతో 16 భవనాలు



శాంతిపురంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం

ప్రస్తుతం గర్భిణులు, బాలింతలకు వైద్యం అందాలంటే ఏరియా, జిల్లా వైద్యశాలలకు వెళ్లాల్సిందే. ఆ పరిస్థితిని మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లోనే వైద్యసేవల విస్తరణకు శ్రీకారం చుట్టాయి. వైద్యశాలలకు అనుసంధానంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 166 యూనిట్ల స్థాపనకు 2021- 22 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌హెచ్‌ఎం- 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా రూ.83 కోట్లను కేంద్రం కేటాయించింది.

- న్యూస్‌టుడే, శాంతిపురం

ఉమ్మడి జిల్లాలో 16 చోట్ల సేవలు

చిత్తూరు జిల్లాలో శాంతిపురం, పాలసముద్రం, విజయపురం, తవణంపల్లె, ఐరాల, చౌడేపల్లె, బైరెడ్డిపల్లె, గుడిపాల, తిరుపతి జిల్లాలో బాలాయపల్లి, డక్కిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం, నాగలాపురం, పిచ్చాటూరు, పాకాల, వడమాలపేట పీహెచ్‌సీలకు బీపీహెచ్‌యూలు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య వసతులే లక్ష్యంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు పెడుతున్నారు. పీహెచ్‌సీల్లో రోజుకు 150 నుంచి 200 వరకు ఓపీ నమోదవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు గర్భిణులు, బాలింతలకు సేవలను పూర్తి స్థాయిలో అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఏరియా, జిల్లా వైద్యశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రసూతి నిపుణులు.. ఎంపిక చేసిన రోజుల్లో అక్కడ సేవలందిస్తారు. ప్రస్తుతం వైద్యులు, విభాగాల నిర్వహణ, రోగుల నిరీక్షణకు సౌకర్యవంతంగా గదుల వసతి లేని విషయాన్ని గుర్తించింది.

వసతులు ఇలా..

రోగుల నిరీక్షణకు విశాలమైన హాలు, మందుల నిల్వకు ప్రత్యేక గది, కంప్యూటర్, రికార్డుల నిర్వహణ, భద్రత, రిసెప్షన్‌కు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. సిబ్బందితోపాటు రోగులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, మూత్రశాలల వసతి ఉంటుంది. సాధారణ రోగులతోపాటు క్షయ, లెప్రసీ బాధితుల వైద్యసేవల విస్తరణకు బీపీహెచ్ యూనిట్లు ఉపయోగపడనున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

రూ.8 కోట్లతో భవనాలు

16 పీహెచ్‌సీలకు అనుబంధంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎనిమిది చొప్పున ఆస్పత్రుల్లో నూతన భవనాలు, వసతుల ఏర్పాటుకు ఒక్కో భవనానికి రూ.50 లక్షల చొప్పున రూ.8 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. పలు చోట్ల సిద్ధం కాగా.. కొన్ని చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి.

శ్రీవారి సేవలో తమిళనాడు మాజీ సీఎం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న మాజీ సీఎంకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఆలయం ఎదుట తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం

కొత్త మద్యం దుకాణాలు అడ్డుకున్న స్థానికులు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: నూతన మద్యం దుకాణాల ఏర్పాట్లను కొన్నిచోట్ల స్థానికులు అడ్డుకున్నారు. వరదయ్యపాళెం పంచాయతీ చెంగాళమ్మ పరమేశ్వరీ దేవాలయం సమీపంలో గతంలోని ప్రభుత్వ మద్యం దుకాణం స్థానంలో అక్కడే మరోమారు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వల్ల పరిసరాల్లో నివసించే ప్రజలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఎక్సైజ్‌శాఖ సీఐ దశరథరామిరెడ్డికి విన్నవించారు. అయిదేళ్లుగా ఇక్కడ ప్రభుత్వ దుకాణంతో మహిళలు, పిల్లలతో నివాసం ఉంటున్న స్థానికులు మందుబాబుల ఆగడాలు, గొడవలతో నరకం అనుభవించామన్నారు. ఇక్కడ మరోమారు మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని సీఐకు వినతిపత్రాన్ని అందించారు. వరదయ్యపాళెం ఎస్సీకాలనీలోని వేంకటేశ్వర ఆలయానికి ఎదురుగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను స్థానిక ఎస్సీ కాలనీ వాసులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దేవాలయం సమీపంలో మద్యం దుకాణాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఎక్సైజ్ సీఐకు వినతి పత్రం అందిస్తున్న స్థానికులు

క్రీడా వికాస కేంద్రాల పనులు పూర్తిచేయాలి

- శాప్ ఛైర్మన్ రవినాయుడు


ఇంజినీర్లతో సమీక్షిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రాల (కేవీకే)పనులు వెంటనే పూర్తి చేసి గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆదేశించారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, సంబంధిత ఇంజినీర్లతో సమీక్షించారు. క్రీడలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గంలో రూ.2.10 కోట్లతో కేవీకేల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన గుర్తుచేశారు. ఇందులో భాగంగా 2018లో చంద్రగిరిలో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం రూ.2 కోట్లు కేటాయించిందని, ఆ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో క్రీడా వసతులు, నూతన స్టేడియాల నిర్మాణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.23 కోట్లు మంజూరు చేయనున్నారన్నారు.

భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం

ముక్కంటి ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ స్పష్టం చేశారు. ఆలయంలోని పరిపాలన భవనం సమావేశపు హాలులో బుధవారం ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య సమక్షంలో ముఖ్య అధికారులతో పాటు భద్రతా విభాగం ముఖ్యులతో సమావేశం అయ్యారు. ఆలయంలోకి ప్రవేశించే నాలుగు గోపురాల్లో ప్రస్తుతం ఉన్న భద్రత సరిపోదని, దాన్ని మరింత పకడ్బందీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుమల తరహాలో మహాద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించి పంపేలా భద్రత వ్యవస్థను పటిష్ఠపరచాలన్నారు. కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో మండపాలను, రోడ్డు నిర్మాణం, దీపాల ఏర్పాటును కైలాసగిరి ప్రదక్షిణ ఉత్సవం నిర్వహించేలోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ శాఖకు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈవో లోకేశ్‌రెడ్డి, సీఎస్‌వో నాగభూషణం, ఆలయ తనిఖీ అధికారులు హరియాదవ్, సుదర్శనం, ఎస్పీఎఫ్, రెవెన్యూ, పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆక్టోపస్ దళం అధికారులతో సమావేశమైన ఈవో చంద్రశేఖర్ ఆజాద్

వరి, ఉద్యాన రైతులకు అధికారుల సూచనలు

తిరుపతి(వ్యవసాయం): జిల్లాలో ప్రస్తుతం వర్షాలకు 75 హెక్టార్లలోని వరి నారుమళ్లు, 20 రోజుల లోపు విత్తిన 2,191 హెక్టార్లలోని వరి పంట, 313 హెక్టార్లలో దుబ్బు దశలో ఉన్న వరి పంట 10 హెక్టార్ల కోత దశ వరి పంట దెబ్బతిని ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. నాలుగు హెక్టార్లలో మొక్కజొన్నకు నష్టం వాటిల్లి ఉంటుందని తెలిపారు. ముంపుకు గురైన పంటలను రక్షించుకునేందుకు పలు సూచనలు చేశారు. నారుమళ్లలో నిలిచిన వర్షపునీటిని పూర్తిగా బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని, అనంతరం ప్రతి ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలని ఆయన సూచించారు. నారుమడిని తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవడానికి సాఫ్ మందును లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. నేరుగా విత్తిన వరి పంటలో అవసరానికి మించి ఉన్న నీటిని బయటకు పంపి పంట వయసుకు తగినట్లు ఎకరానికి 20 నుంచి 30 కిలోల యూరియా, 15-20 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. కోతదశలో లీటరు నీటికి 20-30 గ్రాముల ఉప్పు ద్రావణం పిచికారి చేయడం ద్వారా మొలకల్ని నివారించవచ్చని తెలిపారు.

స్నేహ బంధం.. మృత్యుగండం

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

అమెరికాలో రోడ్డు ప్రమాదంతో జిల్లాలో విషాదం

విదేశాల్లో వృత్తిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా.. అందరూ మంచి స్నేహితులు. పండుగలైనా.. పుట్టినరోజులైనా అందరూ కలిసి ఆనందంగా చేసుకునే వాళ్లు. వాళ్ల నివాస ప్రాంతాల్లో బంధువర్గం బాగున్నా.. వృత్తి రీత్యా వీళ్లుంటున్న అమెరికాలో వీళ్లకు వీళ్లే ఆత్మబంధువులు. అందుకే కాస్తంత సెలవు దొరికినా ఆనందంగా గడుపుతుంటారు. వీరి స్నేహంపై విధికి కన్నుకుట్టింది. రోడ్డు ప్రమాద ఘటనలో కారులో ఏర్పడ్డ మంటల్లో చిక్కుకుని ముగ్గురు దుర్మరణం చెందగా.. మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. మూడు రోజుల పాటు వరుస సెలవులు రావడంతో అమెరికాలో ఉంటున్న వీళ్లందరూ సరదాగా గడిపేందుకు చుట్టు పక్కల ప్రాంతాల వీక్షణకు వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో దక్షిణ బాన్‌హామ్‌కు సమీపంలో అమెరికా కాలమానం ప్రకారం సోమవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ హృదయ విదారక ఘటనపై మృతుల కుటుంబీకులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరి వెనుక ఎన్నో ఆశలు.. ఆకాంక్షలు ఉన్నాయని. అవన్నీ పూర్తి చేయకనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం మరింత విషాదంగా మారింది.

దూరమైన ఆప్యాయత..


హరిత తల్లిని ఓదార్చుతున్న బంధువులు

తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, లతల పెద్ద కుమార్తె హరిత. కష్టపడి చదువుకుంది. తల్లిదండ్రులంటే ప్రేమ. ఈమెకు 2022 ఫిబ్రవరి 11న కేవీబీపురం మండలం ఆదరం గ్రామానికి చెందిన సాయి చెన్నుతో వివాహమైంది. ఇద్దరివీ మధ్య తరగతి కుటుంబాలే. వృత్తిరీత్యా అమెరికాలో ఉంటున్నారు. ఎనిమిది నెలల క్రితం సోదరి వివాహం సందర్భంగా ఇక్కడకు వచ్చి వెళ్లారు. హరిత, సాయి చెన్నుల ఆప్యాయతను తలుచుకుంటూ కుటుంబీకులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. సాయి ప్రాణాలతో బయటపడాలని ఇరు కుటుంబీకులు భగవంతుని ప్రార్థిస్తున్నారు.


భర్త సాయి చెన్నుతో హరిత (పాతచిత్రం)

తమ్ముని కోసం పెళ్లి వాయిదా..


అల్లారుముద్దుగా పెంచుకున్న శునకంతో శివ

తొట్టంబేడు మండలం చిన్నకనపర్తికి చెందిన రాజినేని శివది మధ్య తరగతి కుటుంబం. తల్లిదండ్రులైన రమేష్‌నాయుడు, సుజాతల పెద్దకుమారుడు శివ. తొమ్మిదేళ్లుగా అమెరికాలోనే ఉంటున్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. తమ్ముడు లోకేశ్‌ను డాక్టర్ చేయాలన్న సంకల్పంతో ఎంతో శ్రమించి చదివించారు. తమ్ముని చదువు కోసం విశాఖపట్నంలో కుటుంబం ఉంటోంది. ఇటీవల పెళ్లి సంబంధాలు వచ్చినా తమ్ముడు డాక్టర్ అయ్యాక చేసుకుంటానంటూ సున్నితంగా చెప్పారు. ఎంతో ఇష్టపడి తెచ్చుకున్న శునకాన్ని అల్లారుముద్దుగా పెంచుకునేవారు.

ఆశలన్నీ ఆవిరాయే

ఓజిలి మండలం రాజుపాళెంకు చెందిన తిరుమూరు గోపి తండ్రి హైవే పక్కన హోటల్ నిర్వహిస్తున్నారు. ఎంతో కష్టపడి కుమారుడ్ని చదివించారు. తల్లిదండ్రుల శ్రమను కళ్లారా చూసిన గోపి కష్టపడి చదువుకుని అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా ఉంటున్నారు. రెండేళ్ల క్రితం గోపికి వివాహమైంది. భార్య అమెరికాలో ఉంటూ వచ్చింది. ఆర్నెళ్ల కిందట ఆమె భారత్‌కు వచ్చారు. ఇంతలో ఈ ఘటన జరగడంతో భార్య కుటుంబీకులతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

ప్రమాదంలో మృతి చెందిన వారిని తీసుకువచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తానా సభ్యులతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిరెడ్డికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అక్కడి వారిని కోరారు.


తానా అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

20న స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: అండర్- 19 ఉమ్మడి చిత్తూరు స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో బాక్సింగ్, చదరంగం జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న ఉదయం 9 గంటలకు తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బాక్సింగ్ పోటీలు, ఇదేరోజు ఉదయం 9.30 గంటలకు బైరాగిపట్టెడలోని ఎంజీఎం పాఠశాలలో చదరంగం పోటీలు జరుగుతాయని వివరించారు. పోటీలకు తొమ్మిది, పది, ఇంటర్మీడియట్ చదువుతున్న బాలబాలికలు అర్హులని, ఆసక్తిగలవారు పది మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93936 21004లో సంప్రదించాలన్నారు.

భారతీయ సంస్కృతికి ఆధారం వైఖానసాగమం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బుధవారం ఆగమ విభాగం నిర్వహణలో వైఖానసాగమోక్త అర్చనం అనే అంశంపైన తొమ్మిది రోజుల జాతీయ కార్యశాల ప్రారంభమైంది. మైసూర్ మహారాజ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సత్యనారాయణ, సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి కృష్ణమూర్తి సదస్సును ప్రారంభించారు. శ్రీకంచి కామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి ఆన్‌లైన్‌లో అనుగ్రహ భాషణం చేశారు. వైదికులకు, లౌకికులకు కూడా అర్చన జ్ఞానం తెలియజేయాలన్నారు. ఆగమశాస్త్ర విశేషాలను చిన్నచిన్న గ్రంథాలుగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్లా, దీవి రాఘవ దీక్షితులు, వెంకటరమణ, ఎ.వి.రమణాచార్యులు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	127
రిటైల్	149
లేయర్	120
బ్రాయిలర్స్	216
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	246
లేయర్ మాంసం	204

శస్త్రచికిత్సల్లో మత్తు వైద్యుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ కుమార్ తదితరులు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: శస్త్రచికిత్సల సమయంలో మత్తు వైద్యుల పాత్ర కీలకమని స్విమ్స్ సంచాలకులు ఆర్‌వీ కుమార్ అన్నారు. ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా క్రిటికల్ కేర్ విభాగంతో కలిపి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ.. శస్త్రచికిత్సల విజయవంతంలో మత్తుమందు విభాగం కీలకంగా పనిచేస్తుందన్నారు. విభాగాధిపతి డా.అలోక్ సమంత్ రే మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ ముక్తేశ్వరయ్య, డా.రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లి హత్య కేసులో తనయుడి అరెస్టు

చిల్లకూరు, న్యూస్‌టుడే: చిల్లకూరు మండలం కమ్మవారిపాళెం గ్రామంలో తల్లిని హత్య చేసిన కేసులో నిందితుడైన తనయుడు మనోజ్‌ను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారం కిందట సుశీలమ్మను కన్న కొడుకు కత్తితో నరికి హత్య చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో మనోజ్ కోట అడ్డరోడ్డు సమీపంలోని బస్టాండ్ వద్ద ఉన్నాడనే సమాచారం మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

అద్దెలకూ మద్యం కిక్కు

- తిరునగరిలో ఏకంగా 15 రెట్ల పెంపు
- జిల్లాలో మొదటిరోజు 128 చోట్లే దుకాణాల ప్రారంభం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నూతన మద్యం దుకాణాల ప్రారంభానికి పలు విఘ్నాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో 227 మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ పూర్తికాగా తాత్కాలిక అనుమతులతో వాటిని బుధవారం నుంచి ప్రారంభించాల్సి ఉంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు తోడు అమాంతంగా పెరిగిన గదుల అద్దెలు, భాగస్వామ్య ఒప్పందాలు, నేతల పంచాయితీలు, కనీస వసతులు వంటివాటితో ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

తిరుపతి డివిజన్ పరిధిలోని 141 దుకాణాలకు మొదటిరోజు 66 దుకాణాలు ప్రారంభమయ్యాయి. మిగిలిన 75 మంది ఫీజు రుసుం చెల్లించినప్పటికీ ప్రాంతాలు ఎంపిక చేసుకోవడం. మద్యం డిపో నుంచి సరకు తీసుకెళ్లలేకపోవడం.. బ్యాంకు లావాదేవీల్లో నెలకొన్న సమస్యలు తోడు వర్షం అడ్డంకిగా మారింది. దీనివల్ల సగానికిపైగా దుకాణాలు తిరుపతిలో తెరుచుకోలేదు. గూడూరు డివిజన్‌లో 86 దుకాణాలకు గాను 62 ప్రారంభమయ్యాయి. అతి భారీ వర్షాల కారణంగా 24 దుకాణాలు తెరుచుకోలేదు.

- తిరుపతిలోని ప్రముఖ కూడళ్లలో మద్యం దుకాణాల అద్దె రూ.3 లక్షల వరకు పలుకుతోంది. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల అద్దె కేవలం రూ.20 వేలు ఉండేది. అదే స్థలంలోగానీ.. సమీపంలోగానీ గదులను అడిగితే వాటి యజమానులు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు చెబుతున్నట్లు సమాచారం. దీంతో అద్దెలు పెనుభారంగా మారాయి. తదనంతరం వాటిలో తాగునీటి వసతి, ఆధునికీకరణ పనులు మరో భారంగా భావిస్తున్నారు. దీనివల్ల మొదటి రోజు 99 దుకాణాలు అందుబాటులోకి రాలేదు. వారం రోజుల్లోపు ఎప్పుడైనా ప్రారంభించుకొనే వెసులుబాటు ఉంది. ఆలోపు అధికారులు నిబంధనలను సరిచూసుకుని తుది లైసెన్సులు మంజూరు చేస్తారు.


తిరుపతి నగరంలో ప్రారంభమైన దుకాణం

రిజర్వు అభ్యర్థులకే అవకాశం

లాటరీలో ఎంపికైన ఇద్దరు వ్యాపారులు మంగళవారం రాత్రి వరకు మొదటి కంతు ఫీజు చెల్లించకపోవడంతో రిజర్వు అభ్యర్థికి అవకాశం కల్పించారు. తొట్టంబేడు మండలంలోని 75వ దుకాణం. పాకాల మండలం 133వ దుకాణానికి ఎంపికైన మొదటి అభ్యర్థులు నగదు చెల్లించలేదు. కలెక్టర్ పరిశీలన అనంతరం రిజర్వులో ప్రథమ స్థానంలో ఉన్న వ్యక్తులకు అవకాశం కల్పించడంతో వారు నగదు చెల్లించినట్లు సమాచారం.

- మొదటి రోజు రూ.99లకే ప్రముఖ ట్రాఫికానా కంపెనీకి చెందిన చీప్ లిక్కర్ బాటిళ్లను ప్రవేశపెట్టారు. వీటితోపాటు అన్నిరకాల నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి వస్తున్నట్లు డిపో మేనేజరు జానకిరామ్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిల్వలను అవసరాల మేరకు కేటాయిస్తామని, త్వరలో పూర్తిస్థాయిలో బ్రాండ్లు అందుబాటులోకి వస్తాయని ఆయన వెల్లడించారు.

తిరుపతి
● తిరుపతి ● చంద్రగిరి

మంత్రి లోకేశ్ 'ప్రజా దర్బార్'కు వినతులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ జిల్లాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా ప్రాంతవాసులు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో బుధవారం ఉదయం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో మంత్రి ప్రజల్ని నేరుగా కలుసుకుని వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో మూడేళ్లుగా పనిచేస్తున్న 30 మంది బోధనేతర సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించారని తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని పలువురు సిబ్బంది వినతులు ఇచ్చారు.

కళ్యాణి జలాశయం నిర్వహణలో లోపాలు

చంద్రగిరి గ్రామీణ : జలవనరుల శాఖ అధికారులు కళ్యాణి జలాశయాన్ని సందర్శించారు. ఈఈ శివారెడ్డి ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్వహణ లోపాలు గుర్తించి ఏఈ సుదీప్‌పై మండిపడ్డారు. మూడు గేట్లలో ఒకటి మాత్రమే పని చేయడం, ఇసుక, గుల్లను కట్టపైనే వదిలేయడం, గేట్లకు రంగులు వేశాక కట్టెల మెరవ తొలగించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా రెండు గేట్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డీఈ పి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.


జలాశయాన్ని పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు




▸ ఏపీఎస్‌ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్‌లో ▸ ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో ఇలా.. ▸ కొరమీనుగుంట వద్ద లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కమిషనర్ మౌర్య, ఇతర అధికారులు

తలకోనలో ఉద్ధృతి



యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: వర్షాలతో తలకోన జలాశయం వైపు పర్యాటకులను వెళ్లనీయకుండా పోలీసులు, అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించాలని తహసీల్దారు రూప్‌చంద్, ఎస్సై ఎర్రిస్వామి కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ


తిరుచానూరులోని వీవీనగర్‌లోని లోతట్టు ప్రాంతాలు పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుచానూరు, న్యూస్‌టుడే: లోతట్టు ప్రాంతాల ప్రజలు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుబ్బారాయుడు సూచించారు. బుధవారం తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని వీవీనగర్ తదితర లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరించారు. 112 లేదా 80999 99977 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. డీఎస్పీ ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.


కొరమీనుగుంట కాలనీ పరిధిలో మురుగు



▸ కుమారి ఇంటిలోకి చేరిన వర్షపునీరు..
▸ బియ్యం తడిసిపోకుండా తీసుకువెళ్తున్న మహిళ..


కరుణకాలనీవాసులతో మాట్లాడుతున్న రామచంద్రాపురం తహసీల్దార్ వెంకటరమణ


శ్రీవారి ఆలయం ఎదుట వర్షంలో భక్తుల రాకపోకలు

తిరునగరికి ముంపు తిప్పలు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో జనజీవనం స్తంభించింది. బుధవారం ముసురు, వర్షపు నీటి కాలువలు పొంగి లోతట్టు ప్రాంతాలను జలమయం చేశాయి. గొల్లవానిగుంట, కొరమేనుగుంట, ఆటోనగర్, ఉప్పంగి హరిజనవాడ, లక్ష్మీపురం కూడలి ప్రాంతాల్లో ముంపు సమస్యలు నెలకొన్నాయి. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నగరపాలిక యంత్రాంగం అప్రమత్తమై వర్షపునీటిని తరలించే చర్యలు కొనసాగిస్తోంది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిల్వ ఉన్న నీటిని మోటార్లతో ఎప్పటికప్పుడు తోడుతున్నారు. జేసీబీల సాయంతో మూడు రోజులుగా కాలువల శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టడంతో కొంత ఊరట లభించింది. కమిషనర్ ఎన్.మౌర్య నేతృత్వంలో వైద్య, ఆరోగ్య విభాగం, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి. విద్యుత్‌శాఖ సైతం అప్రమత్తం కావడంతో సరఫరాకు అంతరాయం కలగలేదు. కపిలతీర్థం, మాల్వాడి గుండం కాలువలు పొంగడంతో పలు ప్రాంతాల్లో వర్షపునీరు ఉద్ధృతంగా ప్రవహించింది. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని సైతం అధికారులు అప్రమత్తం చేసి ఖాళీ చేయించారు. ఇళ్లలోకి నీరు ప్రవేశిస్తే ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస, ఆహార సౌకర్యాలు, పునరావాసం గురించి నగరపాలిక ఉద్యోగులు ముందస్తుగా ముంపు ప్రాంతాల్లో ఇంటింటికి సమాచారం చేరవేశారు.


కాలువల్లో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

● నగరంలోని 17 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల్ని అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ముంపు ప్రాంతాల్లోని 995 కుటుంబాలకు చెందిన 2,691 మందికి ఆశ్రయం కల్పించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు లోతట్టు ప్రాంతాల కుటుంబాలు నిరాకరించడంతో వారిలోని 300 మందికి బుధవారం మధ్యాహ్నం, రాత్రి ఆహారాన్ని పంపిణీ చేశారు. సహాయ చర్యల కోసం 0877- 2256766 నంబరును సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఆక్రమణలతో పెరుగుతోన్న సమస్యలు

నగరంలోని ప్రధాన వర్షపునీటి కాలువలన్నీ ఆక్రమణలు, అక్రమ కట్టడాలతో నిండిపోయాయి. తిరుమల కొండల నుంచి ప్రవహించే మాల్వాడిగుండం, కపిలతీర్థం కాలువల పరివాహక ప్రాంతాల్లో కాలువలన్నీ కబ్జాకు గురై కుచించుకుపోయాయి. చిన్నపాటి వర్షానికి సైతం తిరుపతిలోని ఎర్రమిట్ట, గోవిందనగర్, వెంకటరెడ్డికాలనీ, కొత్తపల్లి, రైల్వేకాలనీ, యశోదనగర్, కొర్లగుంట, కట్టకిందపల్లె ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. దొడ్డాపురంవీధిలో శిథిలావస్థలో ఉన్న ఇంటిలో నివసిస్తున్న 20 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. ఉప్పంగి హరిజనవాడలోని నాలుగు కుటుంబాలను తరలించినప్పటికీ వారు కొంతసేపటికే ఇక్కడ చేరిపోయారు.

జనజీవనం అస్తవ్యస్తం

పాకాల : రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పాడి రైతులకు కష్టంగా మారింది. పశుగ్రాసానికి అవస్థలు పడ్డారు. టమోటా వంటి కూరగాయ తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటివద్దే ఉండిపోవాల్సివచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పనులు అరకొరగానే సాగాయి.

ముంపు ప్రాంతాల్లో పరామర్శ

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: వర్షంతో నగర పరిధిలోని కాలువలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోకి వరదనీరు చేరింది. అధికారులు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, ఎంపీడీవో రామచంద్ర, ఇరిగేషన్‌శాఖ డీఈ వెంకటేశ్వరప్రసాద్, తహసీల్దార్ భాగ్యలక్ష్మితో కలిసి కేబీఆర్‌నగర్, వెంకటేశ్వరకాలనీలో పర్యటించి బాధితులను పరామర్శించారు. గ్రామానికి వెళ్లేదారిలో కొట్టుకుపోయిన కల్వర్టు నిర్మాణానికి రూ.35 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, మూడునెలల్లో పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తిరుమలనగర్‌లో ఏర్పాటు చేసిన పునరావాసం కేంద్రంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఆహార పదార్థాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వెంకటేశ్వరకాలనీలోని వరదకాలువను పరిశీలించారు.


తిరుమలనగర్ పంచాయతీలో బెడ్‌షీట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రవాణా.. వసతి లేమితో భక్తుల అగచాట్లు

తిరుపతి (బైరాగిపట్టెడ) : నగరంలో ఏప్రాంతం చూసినా రోడ్లపై వర్షపునీరు పొంగి పొర్లుతోంది. శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు కొన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు సరిగాలేకపోవడంతో తిరుపతిలోనే గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొందరు ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు యత్నించారు. మరికొందరు శ్రీనివాసం, విష్ణు నివాసం, మాధవం భూదేవి కాంప్లెక్స్ పరిధిలోని డార్మిటరీలను ఆశ్రయించారు. సరైన ఆహారం, పానీయాలు దొరకడం లేదని పలువురు ఆవేదన చెందారు. **చంద్రగిరి :** వరదనీటి ప్రవాహానికి శ్రీవారి మెట్టు మార్గంలోని మూడు ప్రదేశాల్లో మొట్లు కొట్టుకుపోయాయి. బుధవారం సాయంత్రం నుంచి యాత్రికుల రాకపోకలు నిలిపివేశారు. తహసీల్దారు శివరాంసుబ్బయ్య, సీఐ సుబ్బరామిరెడ్డి పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లి సమీపంలోని మాలవానిగుంట చెరువును పరిశీలించారు. ఏదైనా సమస్యలు ఎదురైతే తక్షణమే 72070 08187తో పాటు చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

విజయనగర కాలనీలో మళ్లింపు


కాలనీలోకి వచ్చిన వర్షం నీటిని మళ్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: వేదాంతపురం పంచాయతీ విజయనగరకాలనీలో వర్షం నీళ్లు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. పంచాయతీ అధికారులు స్పందించి జేసీబీతో కాలువ తీసి నీళ్లను మళ్లించారు. సీపీఐ మార్క్స్‌నగర్‌లోనూ చర్యలు తీసుకున్నారు. గాంధీపురంలోని పలు ఇళ్లలోకి వర్షం నీళ్లు చేరాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తినాని కూటమి నాయకులను అప్రమత్తం చేశారు. సెల్వం కుంటుబాన్ని శ్రీనగర్ కాలనీలోని పునరావాస కేంద్రానికి తరలించారు. ఇళ్లవద్దకు నీళ్లు చేరడంతో స్థానికులు ఎక్కడ ప్రహరీ కూలిపోతుందోనని భయపడుతున్నారు.

పల్లె పండగ.. ప్రగతి దిశగా

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఆర్థిక సంఘం నిధులను సైతం మళ్లించారు. కూటమి ప్రభుత్వం రాకతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో 'పల్లె పండుగ' అందుకు వేదికవుతోంది.

రూ.2.10 కోట్లు.. ▸ చంద్రగిరి: మండలంలోని 21 పంచాయతీల పరిధిలో రూ.2.10 కోట్లు వెచ్చించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మురుగునీటి కాలువలు, సిమెంటు రోడ్లు, గోకులాలు, తారురోడ్ల నిర్మాణాలు వంటి 292 అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

రూ.61 లక్షలతో భూమిపూజ.. ▸ పాకాల : చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తొలిరోజు దామలచెరువు పంచాయతీ పోలిచెట్టిపల్లి, మౌలాలీపేట, రాజీవ్‌కాలనీల్లో రూ.61 లక్షలతో తాగునీరు, సీసీ రోడ్లు, మురుగు కాలువల ఏర్పాటు పనులకు భూమి పూజ నిర్వహించారు. దశలవారీగా హామీలు అమలు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

పాకాల మండలంలో కేటాయించిన నిధులు

విభాగం	రూ.కోట్లలో
డ్రైనేజీ కాలువలు	2.65
జలవనరులు	0.92
పంటకాలువలు	0.38
మామిడి సాగు	1.33
ఇతరాలు	4.93

రూ.2.60 కోట్లు.. ▸ రామచంద్రాపురం: ఉపాధి హామీ పథకం కింద మండలంలో 16 పనులకు రూ.2.60 కోట్లు మంజూరయ్యాయి. అనుప్పల్లికి రూ.52 లక్షలు, కొత్తవేపకుప్పానికి రూ.12 లక్షలు, నెత్తకుప్పానికి రూ.43 లక్షలు, సి.కాళేపల్లికి రూ.35 లక్షలు, రాయలచెరువుకు రూ.33 లక్షలు, కుప్పం బాదూరుకు రూ.24 లక్షలు, కొత్తకండ్రిగకు రూ.61 లక్షలు కేటాయించారు.

47 పనులు.. ▸ తిరుపతి (గ్రామీణ) : మండలంలో 47 పనులకు కలెక్టర్ పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. రూ.3.91 కోట్లతో ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు పంపించారు. మురుగు కాలువలకు రూ.2.91కోట్లు, తిరుచానూరు పంచాయతీ పరిధిలోని దామినేడులో రూ.కోటితో యూడీఎస్ నిర్మించనున్నారు.


తొలిరోజు పోలిచెట్టిపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

టమాటా పంటల పరిశీలన.. యర్రావారిపాలెం: రైతులు సాగుచేసిన టమాటా పంటలను బుధవారం ఉద్యానవనశాఖ అధికారిణి శివకుమారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలతో తీసుకోవాల్సిన పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆకుమచ్చ తెగులు, వేరు కుళ్లు సోకే అవకాశం ఉందని, కాపర్ ఆక్సీక్లోరైడ్ 10 గ్రాములు చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్ల వద్ద పిచికారి చేయాలని సూచించారు.

తిరుమలలో విజిలెన్స్ డైరెక్టర్.. తిరుమల: శ్రీవారి దర్శనార్థం తమిళనాడు విజిలెన్స్ డైరెక్టర్ అభయ్‌కుమార్ బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. స్థానిక అతిథిగృహం వద్ద తితిదే అధికారులు ఆయనకు స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అమ్మవారి సేవలో పన్నీరుసెల్వం.. తిరుచానూరు: శ్రీపద్మావతీ అమ్మవారిని బుధవారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

పట్టభద్రుల దినోత్సవం


ఉమామహేశ్వరరావు

రామచంద్రాపురం: వెంకట్రామాపురంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసి కళాశాలలో బుధవారం పట్టభద్రుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీపద్మావతి మెడికల్ కళాశాల ఫార్మాకాలజి విభాగాధిపతి డా. కె.ఉమామహేశ్వరరావు, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ డా. నిరంజన్‌బాబు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీవేదనారాయణ విద్యాసంస్థల ఛైర్మన్ దినకర్ బాబు పాల్గొన్నారు.



కోరి వచ్చి.. బ్రాండు మెచ్చి

చంద్రగిరి పట్టణంలో బుధవారం నూతన మద్యం దుకాణం ప్రారంభించడంతో మద్యం బాబులు పోటెత్తారు. వరుసక్రమంలో నిల్చుని కోరిన బ్రాండ్ల ఎమ్మార్పీ ధరకు తీసుకెళ్లారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

చంద్రగిరి, న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఎం.హేమేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. నాలుగేళ్ల కిందట మండలంలో అనేకచోట్ల కల్వర్టులు, కాజ్‌వేలు, స్వర్ణముఖి వంతెన కొంతమేరకు కొట్టుకుపోయినట్లు గుర్తుచేసి అప్రమత్తం చేశారు. ఎంపీటీసీ సభ్యులు బుల్లెట్ చంద్రమౌలిరెడ్డి, మాధవరెడ్డి, బోసుచంద్రారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఔరంగజేబ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

✱ పాత నేరస్థుడి అరెస్టు.. తిరుపతి(నేరవిభాగం): ఇంట్లో దొంగతనాలకు పాల్పడే పాత నేరస్తుడిని అరెస్టు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. సెప్టెంబరు 28వ తేదీన ధనలక్ష్మి నగర్‌కు చెందిన భాగమ్మ ఇంట్లో 17 గ్రాముల బంగారు గొలుసు చోరీ జరిగింది. జీవకోనకు చెందిన ఆటో డ్రైవర్ వరదరాజుల ముని (35)ని నిందితుడిగా గుర్తించారు. బుధవారం స్థానిక వైకుంఠపురం సబ్ స్టేషన్ వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. బంగారు గొలుసు కుదువ పెట్టిన రసీదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

✱ బాలిక అదృశ్యం.. యర్రావారిపాలెం: యర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీలో బాలిక అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. తిమ్మాడివాండ్లపల్లికి చెందిన బాలిక(17) అన్నమయ్య జిల్లా గాలివీడులో ఇంటర్ చదువుతోంది. దసరా సెలవులు కావడంతో ఇంటివద్ద ఉన్న బాలికల ఈనెల 11న ఉదయం అదృశ్యమైంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆచూకీకోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై ఎర్రిస్వామి తెలిపారు.

✱ ద్విచక్ర వాహన దొంగ అరెస్టు.. తిరుపతి(నేరవిభాగం): స్విమ్స్, రుయా ప్రభుత్వ ఆస్పత్రుల ప్రాంగణంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పడమర సీఐ రామకృష్ణ తెలిపారు. అనేక ఫిర్యాదుల నేపథ్యంలో దర్యాప్తు చేసి కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ సమీపంలోని నిమ్మకాయలపల్లికి చెందిన సాయి ప్రకాష్ (27)ని అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. నిందితుడు కొంతకాలంగా కొర్లగుంట మారుతీనగర్‌లో ఉంటూ చోరీలకు పాల్పడేవారన్నారు. రూ.5 లక్షల విలువైన ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అనిల్‌కుమార్, ఏఎస్సై షణ్ముగం, హెచ్‌సీ వెంకటేశ్వరరావు, పీసీలు రాము, గోపినాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు

ఉత్సవర్లకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువుదీరిన శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కంద మూర్తి ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ఆశ్వీయుజ పున్నమిని పురస్కరించుకుని బుధవారం ఆలయంలోని అలంకార మండపంలోనే పూజా కార్యక్రమాలు జరిపారు. వర్షం కారణంగా ఊంజల్‌సేవను రద్దు చేయడంతో అలంకార మండపంలోనే వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ విశేషోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు.

వీడని లీకేజీల బెడద

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని లీకేజీల సమస్య వెంటాడుతూనే వస్తోంది. వాయుగుండం కారణంగా రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆలయంలోని పలు చోట్ల బుధవారం నీటిధారలతో గోడలు, స్తంభాలన్నీ తడిసిపోయాయి. ప్రధానంగా మహాద్వారం గోపురం లోపలి వైపున మూలల్లో నీటిధారలు ఎక్కువగా పడుతున్నాయి. దీంతో మహాద్వారం వద్ద వెళ్లే భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీన్ని గమనించిన అధికారులు అక్కడ జారకుండా చర్యలు చేపట్టారు. అమ్మవారి ఆలయం, స్ఫటికలింగం, యాగశాల, కాలభైరవస్వామి తదితర పరివార దేవతా మూర్తులతో పాటు రాహు, కేతు మండపాల్లోనూ నీటి ధారలతో అక్కడి ప్రాంతం తేమగా మారింది.



పైకప్పు నుంచి కారుతున్న వర్షపు నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం



తొట్టంబేడు: కల్లిపూడి ఎస్సీ కాలనీలో ఇంట్లోకి చేరిన నీరు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లిపూడి ఎస్సీ కాలనీ, పొయ్య పంచాయతీలోని రామానాయుడు ఎస్టీ కాలనీ, గణపతినగర్ ఎస్టీ కాలనీల్లో ఇళ్ల అంచువరకు వరదనీరు చేరడంతో కాలనీల్లోని ప్రజలు అవస్థలు పడ్డారు. అధికారులు సురక్షిత ప్రాంతాలకుచేర్చి భోజన వసతి కల్పించారు. రౌతుసూరమాల పంచాయతీలో 20 ఎకరాల వరిపైరు నీటమునిగింది. మండలంలోని కారాకొల్లు, చిట్టత్తూరు వాగులకు వరదనీరు చేరుతుండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా రాకపోకలను నిషేధించడంతో ఆ గ్రామాల మధ్య ప్రయాణం స్తంభించింది.



తొట్టంబేడు: ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చిట్టత్తూరు వాగు



తొట్టంబేడు మండలం కొణతనేరి వద్ద మునిగిన వరినారు



పట్టణంలోని బీసీ సమీకృత సంక్షేమ వసతి గృహంలో బాధితులు



చెంచులక్ష్మి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

వర్షం.. సర్వత్రా సంకటం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కాస్త వాయుగుండంగా మారడంతో ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలతో సంకట పరిస్థితులు తప్పలేదు. పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాల్లో పలు చోట్ల నీటి నిల్వలు చుట్టుముట్టాయి. ప్రధానంగా హౌసింగుబోర్డు, బృందమ్మకాలనీ, నారాయణపురం, దక్షిణకైలాసనగర్, సంతమైదానం, న్యూశ్రీరాంనగర్ కాలనీ, సన్నిధివీధి, ప్రాజెక్టు వీధి ప్రాంతాల్లో వర్షపు నీళ్లు నిలబడటంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయితే అప్పటికప్పుడు నీటి నిల్వలు తొలగించే దిశగా పురపాలక సంఘ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణానికి సమీపంలో ఉన్న చెంచులక్ష్మికాలనీని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సందర్శించారు. వర్షానికి అక్కడి ప్రజలు పడుతున్న అవస్థలను అడిగి తెలుసుకున్నారు. వర్షం తాకిడి ఎక్కువగా ఉండటంతో వారిని సమీకృత సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి పంపినట్లు ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, కమిషనర్ గిరికుమార్‌లు సంయుక్తంగా తెలిపారు.

చెరువులకు జల సిరులు: ఇన్నాళ్ల పాటు నీటి నిల్వలు లేక ఖాళీగా ఉంటున్న చెరువులు జలసిరులతో దర్శనమిస్తున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో ఉన్న చెరువులన్నీ నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయి. శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల పరిధిలోని చెరువుల్లో 50 నుంచి 60 శాతం మేర నీటి నిల్వలు చేరాయి.

❖ శ్రీకాళహస్తి నియోజక వర్గ పరిధిలోని పలు చోట్ల సాగు పనులు ప్రారంభించిన రైతులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. ప్రధానంగా వరి సాగుకు సిద్ధం చేసుకున్న నార్లు మునిగి పోవడంతో అవస్థలు తప్పలేదు.

❖ చెరువులకు జలకళ ❖ పొలాల్లో చేరిన వరద



ఊరందూరు చెరువుకు చేరిన నీరు



కడప-రేణిగుంట జాతీయ రహదారిపై కూలిన వృక్షం

స్తంభించిన జనజీవనం

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎల్లమండ్యం గ్రామంలో లోతట్టు ప్రాంతాలకు చెందిన 15 కుటుంబాలను అధికారులు స్థానిక ఎంపీపీ పాఠశాలకు తరలించారు. భగత్ సింగ్ కాలనీ, రాజరాజేశ్వరినగర్, జ్యోతిరావుపూలే కాలనీ, వివేకానందకాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరుకుంది. పాత విమానాశ్రయం మార్గంలోని రామకృష్ణాపురం కూడలి వద్ద ఉన్న కల్వర్టుపై ప్రమాదస్థాయిలో నీరు చేరింది. వెంకటాపురం పంచాయతీ పరిధిలో తిమ్మయ్యగుంట చెరువు తూము మార్గంలో పిచ్చి మొక్కలను తొలగించారు. సంతగేటు వద్ద ఉన్న కల్వర్టుల్లో జేసీబీతో తొలగించి నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. రేణిగుంట-కడప మార్గంలో మామండూరు వద్ద భారీ వృక్షం కూలడంతో ట్రాఫిక్ స్తంభించింది.



ఇంట్లో చేరిన వర్షపు నీటిని బయటకు పోస్తున్న మహిళ



అరుణనది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

వరద ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణవనం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజా, ఆస్తినష్టం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అధికారులను కోరారు. బుధవారం మండలంలోని తిరువట్యం, తుంబూరు వద్ద అరుణనది ప్రవాహాన్ని పరిశీలించి క్షేత్రస్థాయి అధికారులతో పర్యటించారు. ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దారు జయరాములు పాల్గొన్నారు.



తుంబూరు వద్ద నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

వరద కలవరం.. అంతటా జలమయం

వరదయ్యపాళెం: గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురం వద్ద ప్రవహిస్తున్న సున్నపుకాలువ వంతెన రహదారిపై నీరు ప్రవహిస్తోంది. తహసీల్దారు రాజశేఖర్, ఎస్సై మల్లికార్జున్ తుపాన్ పరిస్థితులను సమీక్షిస్తూ మండలంలోని పాండూరు, కదూరు, సీఎల్ఎన్‌పల్లి, నదిపరిపాక ప్రాంతాలలోని రహదారుల వద్ద సిబ్బందిని నియమ ఏర్పాటు చేసి కల్వర్టులు, వంతెనలు దాటే స్థానికులను అప్రమత్తం చేశారు. సీఐ మురళి మండలంలో పర్యటించి సమీక్షించారు. సంతవేలూరు చెరువు తూము వద్ద అనకట్ట బలహీనంగా ఉండటంతో రైతుల సమాచారం మేరకు జలవనరులశాఖ ఏఈ నాగరాజు చెరువును పరిశీలించారు. మరమ్మతులకు ప్రతిపాదనలను కలెక్టరుకు నివేదించినట్లు తెలిపారు.

జలమయంలో గిరిజన కాలనీ

ప్రభావిత వరదలకు జలమయమవుతున్న వరదయ్యపాళెం పంచాయతీ బీజీఆర్ ఎస్టీకాలనీలోకి నీరు చేరింది. సున్నపుకాలువ ప్రవాహ ఉద్ధృతికి కాలనీలోని పూరిళ్లలోకి నీరు చేరింది. తహసీల్దారు రాజశేఖర్ ఆదేశాల మేరకు లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. గోవర్ధనపురం పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



వరదయ్యపాళెం: నీటిలో బీజీఆర్ గిరిజనకాలనీ



వరదయ్యపాళెం: గిరిజనులకు భోజనం అందిస్తున్న లోకా ఫౌండేషన్ ప్రతినిధులు



కైలాసకోన జలపాతం

పరవళ్లు తొక్కుతున్న జలపాతాలు

నారాయణవనం, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కైలాసకోన, సింగిరికోన, తోట కోన జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నారు. నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో ప్రజలను అనుమతించడంలేదు.

21 అడుగులకు చేరిన అరణియార్ నీటిమట్టం

నాగలాపురం, న్యూస్‌టుడే: పిచ్చాటూరులోని అరణియార్ జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 18.9 అడుగులుగా ఉన్న నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 21 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1.85టీఎంసీలుగా ఉన్న జలాశయంలో ప్రస్తుతం 0.712 టీఎంసీలు నీరు చేరింది. ఎగువ నుంచి 2200 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని ఏఈ లోకేశ్వరరెడ్డి తెలిపారు.



అరణియార్ జలాశయం

ప్రయాణ ప్రాంగణం.. నీటి ధారతో సతమతం



గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీకాళహస్తి ఆర్టీసీ ప్రాంగణంలో పైకప్పు నుంచి ఏర్పడిన నీటి లీకేజీతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన భవనం కావడంతో ప్రాంగణంలో పలు చోట్ల వర్షపు నీరు వెల్లువలా ఉరుస్తోంది. కూర్చున్న ప్రయాణికులపై ఏకధాటిగా లీకేజీ నీరు పడుతుండడంతో అవస్థలు పడ్డారు. పలుచోట్ల లీకేజీ అధికంగా ఉండడంతో ఆర్టీసీ సిబ్బంది నీటి ధార వద్ద బక్కెట్లను ఏర్పాటు చేశారు. లీకేజీ అవుతుండడంతో ఇబ్బంది పడ్డ పలువురు ప్రయాణికులు ఆర్టీసీ సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

ప్రవాహం.. రాకపోకలకు అంతరాయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: వాయుగుండం ప్రభావంతో ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట-గుడిమల్లం ప్రధాన రహదారిపై సీతకాలువ కాజ్‌వేపై వరద నీరు ప్రవహించడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముందస్తు జాగ్రత్తగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులు ఆలయానికి రావద్దని అధికారులు తెలియజేశారు. వికృతమాల ఎస్సీకాలనీ సమీపంలో కాలువ పొంగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుడిమల్లం, జంగాలపల్లి సమీపంలో విద్యుత్తు స్తంభాలు కుప్పకూలడంతో అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించారు. చిందేపల్లి, చింతలపాళెం ఎస్టీకాలనీలోకి నీరు చేరడంతో తహసీల్దార్ భార్గ, ఎంపీడీవో సౌభాగ్యం పరిశీలించి స్థానికులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఏర్పేడులో ప్రహరీ కూలడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ముసలిపేడు, మునగలపాళెం పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వచేరకుండా జేసీబీతో తొలగించారు.

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని వెంకటగిరి-శ్రీకాళహస్తి ప్రధాన రహదారిపై ముచ్చువోలు సమీపంలో, శ్రీకాళహస్తి-కాట్రకాయలగుంట సమీపంలోని కాజ్‌వేలు ప్రవహించడంతో ఏర్పేడు మీదుగా వాహన చోదకులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముళ్లపూడి ఎస్టీకాలనీలోకి నీరు చేరడంతో గ్రామీణ సీఐ సంఘటన స్థలాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించారు. గుండ్లపల్లిలో కొన్ని నివాసాల్లోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.



శ్రీకాళహస్తిగ్రామీణం.. గుండ్లపల్లిలో ఇంటిలోకి చేరిన నీరు



శ్రీకాళహస్తిగ్రామీణం.. ముళ్లపూడి ఎస్టీకాలనీ సమీపంలోని కాజ్‌వేను పరిశీలిస్తున్న సీఐ రవినాయక్



ఏర్పేడులో కూలిన ప్రహరీ



చిందేపల్లి ఎస్టీకాలనీలోకి చేరిన నీరు



జంగాలపల్లి సమీపంలో తెగిన విద్యుత్తు తీగలను సరిచేస్తున్న సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, సత్యవేడు

సమస్య: సత్యవేడు హరిజనవాడులోని పలు వీధుల్లో సిమెంట్ రోడ్లపై గుంతలు ఏర్పడి వర్షపునీరు నిలిచి దోమలు, ఈగలతో సతమతమవుతున్నాం. - ఇన్నా, స్థానికుడు

సమాధానం: గుంతల్లో నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, ఎంపీడీవో

వీధి దీపాల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణానికి సమీపంలోని ప్రాజెక్టు వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ దీపాలు సక్రమంగా వెలగకపోవడంపై ఈ నెల 3వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పురపాలక సంఘ కమిషనర్ గిరికుమార్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో వీధి దీపాలను బాగు చేశారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



జడేరిలో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

సిమెంట్ రోడ్లకు భూమిపూజ

సత్యవేడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని జడేరి, ఎఎమ్ పురం గ్రామాల్లో పలు సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడేరి సర్పంచి బాబు యాదవ్, పంచాయతీ సెక్రెటరీ యుగంధర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యం, చెంచయ్య, జయరామయ్య, జ్యోతి, మణిమ్మ, శీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు అప్రమత్తతే అవశ్యం

నాగలాపురం, న్యూస్‌టుడే: ఉద్ధృతరూపం దాలుస్తున్న తుపాను నుంచి ప్రమాదాలను నివారించుకోవడానికి ప్రజలు, అధికారుల అప్రమత్తతే అత్యావశ్యకమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. నాగలాపురం ఏఎంసీ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కేవీబీపురంలో పూడిసీకేపురం, అంజూరుపాళెం, కళత్తూరు, వరదయ్యపాళెం వంతెన, గోవర్ధనగిరి ఎస్టీకాలనీ, సత్యవేడు మండలంలోని వెంకటరెడ్డికండ్రిగ, కంచరపాళెం, నాగలాపురంలోని ద్వారకానగర్, కొట్టకాడు, నారాయణవనంలోని తిరువట్యం, తుంబూరు, పాలమంగళం ఉత్తరంలో గత వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో కాజ్‌వేలు, రహదారుల ఆధునికీకరణను తాను పలుమార్లు గత ప్రభుత్వ పెద్దలను కోరినా ఫలితం లేక పోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ద్వారకానగర్‌కు రూ. 11 కోట్లు, పూడిసీకేపురానికి రూ.5 కోట్లు మేర అనుమతులు త్వరలోనే మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమసెల్వకుమార్, సర్పంచి ధనపాల్‌తెన్నరసు, మాజీ ఎంపీపీ మురళి, మాజీ వైస్‌ఎంపీపీ అన్బయగన్‌అన్బు, నేతలు శేషాద్రి, సురేష్, నాగయ్య, మాతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తప్పిన ప్రమాదం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని టీటీఈ పరిశ్రమలో స్వల్పవిద్యాదాఘాతం నెలకొన్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. టీవీల తయారీ ప్లాంట్‌లోని మదర్‌బోర్డుల బ్లాక్‌లో ఉన్నట్లుండి విద్యుదాఘాతం ఏర్పడింది. అయితే పరిశ్రమ అధికారులు అప్రమత్తం కావడంతో అప్పటి కప్పుడే సమస్యను పరిష్కరించారు. దీంతో ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.



అన్నదానం చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమసెల్వకుమార్

వరద బాధితులకు అన్నదానం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం బీసీకాలనీలో బుధవారం వరదనీరు చేరటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులన్నీ జలమయం కావడంతో అవస్థలు పడుతున్న స్థానికులకు తెదేపా ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమ సెల్వకుమార్ మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.50 వేలు కాజేత

పుత్తూరు, న్యూస్‌టుడే: ఏటీఎం కార్డు చోరీ చేసి రూ. 50 వేలు డ్రా చేసుకెళ్లిన ఘటన బుధవారం పట్టణంలో జరిగింది. నారాయణవనం మండలం గోవిందప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన మనోహర్ ఎస్బీఐ ప్రధాన బ్రాంచిలో ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వచ్చాడు. ఏటీఎంలో కార్డు పెట్టి డ్రా చేసేందుకు ప్రయత్నించగా నగదు రాలేదు. దీంతో కార్డు ఏటీఎంపై పెట్టి తన వద్ద ఉన్న పాసుపుస్తకాన్ని పరిశీలిస్తుండగా వెనకే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి కార్డు మార్చి తీసుకెళ్లాడు. ఆపై వేరే ఏటీఎంకు వెళ్లి రూ. 50 వేలు డ్రా చేసుకున్నట్లు బాధితుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తల్లీకుమార్తెల అదృశ్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తల్లీకుమార్తెలు అదృశ్యమైన ఘటనపై ఒకటో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. స్థానిక కొండమిట్టలో నివాసముంటున్న తల్లీ, కుమార్తెలు ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమైయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీఆర్ కండ్రిగ కల్వర్టును పరిశీలించిన ఎస్సై

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని పలుగ్రామాల్లో అధికారులు పర్యటించారు. వీఆర్‌కండ్రిగ వద్ద ఉన్న కల్వర్టును, రాజుగుంట గ్రామ సమీపంలో చెరువును, పలు కాలువలను ఎస్సై రామస్వామి పర్యవేక్షించారు.


తడ: గ్రద్దగుంట వద్ద నీట మునిగిన పంటలు

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట


నాయుడుపేట నుంచి జువ్వలపాళెం వెళ్లే జాతీయ రహదారి అండర్ పాస్‌లో నీరు

నీట మునిగిన నివాసాలు

ఎమ్మెల్యే కురుగొండ్ల చొరవతో నీటి మళ్లింపు

వెంకటగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాలిటీలో విస్తారంగా వర్షాలు కురిశాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కైవల్యానది ఉద్ధృతంగా ప్రవహించింది. వెలిగొండలో విపరీతమైన వర్షం కురవడంతో సన్యాసి మడుగు వద్ద వరద ప్రవహించింది. ఇక్కడి ఆనకట్ట వద్ద నీరు వేగంగా పారింది. పురపాలక పరిధిలోని సవారిగుంట, చింతచెట్టు ప్రాంతాల్లో వర్షపునీటితో నివాసాలు నీటమునిగాయి. సవారిగుంటలో నిలిచిన నీటిని తోడేందుకు మోటార్లు వినియోగించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పురపాలక అధికారులకు సూచించారు. మోటార్లు, ఆయిల్ ఖర్చులకు ఎమ్మెల్యే తన సొంత నగదును మున్సిపల్ సిబ్బంది అందించి తక్షణమే నీరు వెలుపలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కైవల్యానది కాజ్‌వే, గొడ్డేరు వాగు వద్ద పహారా ఉంచాలని సీఐ వెంకటరమణకు తెలిపారు. పట్టణంలోని ధర్మాపురం ప్రాంతంలో వర్షపునీరు రావడంతో పలువురు నివాసాల్లో నీరు చేరింది. మూలసాలెవీధి, ఎన్టీఆర్ కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడంతో అగచాట్లు పడ్డారు.

● ఆక్రమించి కడుతుంటే ఏం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పురపాలక అధికారులపై మండిపడ్డారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ వద్ద నిలిచిన వర్షపు నీటిని పరిశీలించారు. అమ్మవారిపేట చెరువులోకి వెళ్లే వరవ కాలువ నీటి కాలువను ఓ వ్యక్తి ఆక్రమించి భారీ భవన నిర్మాణం చేపట్టడాన్ని గుర్తించిన ఆయన ఆగ్రహించారు.

అతలాకుతలం

☛ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం.. ప్రజలకు తప్పని ఇబ్బందులు

☛ పునరావాస కేంద్రాల ఏర్పాటు.. అధికారుల సహాయక చర్యలు


సూళ్లూరుపేట: దామరాయ పంట పొలాల్లో నీరు

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అతలాకుతలం అయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.. సహాయక చర్యలు చేపట్టారు. చెరువులు, వాగులు, వంకల్లోకి వరద చేరుతోంది. పలుచోట్ల పంటలు నీటమునిగాయి. -న్యూస్‌టుడే బృందం

ఎక్కడి నీరు అక్కడే

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట ప్రాంతంలో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. కమిషనర్ చిన్నయ్య స్పందించి జీఎన్‌టీ రోడ్డులో బ్రహ్మంగారి మఠం వద్ద పొక్లెయిన్ సాయంతో కాలువ తవ్వించి నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కోళ్లమిట్ట ప్రాంతంలో వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. చెంగాళమ్మ ఆలయం వద్ద కాలువలో తూములు పూడ్చివేయడంతో వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. వట్రపాళెంతోపాటు, మరికొన్ని లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. శ్రీహరికోట రోడ్డులోని బాలికల గురుకుల విద్యాలయం, కోర్టు భవనాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వర్షపు నీరు చుట్టుముట్టింది.

ఎప్పటికప్పుడు పూడికతీత

నాయుడుపేట పట్టణం, నాయుడుపేట: నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ వర్షం కురుస్తోంది. లోతట్టు, ఖాళీ ప్రాంతాలు జలమయం అయ్యాయి. పురపాలక పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టారు. విన్నమాల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య, సచివాలయం సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. స్వర్ణముఖి నదిలో ప్రవాహం మొదలైంది.

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పరిశీలన

తడ, న్యూస్‌టుడే: తడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పరిశీలించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఆహార పొట్లాలు అందించారు.


వాకాడు: తూపిలిపాలెం పునరావాస కేంద్రంలో ఆహారం అందిస్తున్న తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావు


తడలో పునరావాస కేంద్రంలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ


గొడ్డేరు వాగు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ


సూళ్లూరుపేట పునరావాస కేంద్రంలో ఆహార పొట్లాలు అందిస్తున్న కమిషనర్ చిన్నయ్య

పంటల మునక

తడ, న్యూస్‌టుడే: కరిపేటికాల్వ, కాళంగి నదులు నిండుగా ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. చేనిగుంట వద్ద కరిపేటికాల్వ పొంగి పొలాలను ముంచెత్తింది. తడ, తడకండ్రిగ పంచాయతీల పరిధిలోని ఎస్టీ కాలనీల్లోకి వర్షపునీరు చేరడంతో తడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. నిప్పో యాజమాన్యం సహకారంతో పునరావాసంలో ఉన్న బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. చేనిగుంట, గ్రద్దగుంట, తడకండ్రిగ, కొండూరు, వాటంబేడు, కారిజాత ప్రాంతాల్లో ఎల్లి పైర్లు నీట మునిగాయి. ఇరకం దీవిలో పులికాట్ సరస్సులోని ఉప్పునీరు పోటెత్తి పంట పొలాలను ముంచెత్తాయి. పంట చేతికందే పరిస్థితి లేదని అన్నదాతలు వాపోతున్నారు.

పిడుగుపాటు.. తప్పిన ప్రమాదం

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మన్నెగుంట సమీపానున్న భోనుగుంట, తహసీల్దారు కార్యాలయం పక్కనే ఉన్న కాలనీల్లోకి వర్షపునీరు చేరింది. తిప్పగుంటపాళెం వద్ద కాజేవేపై నీరు పారుతోంది. పోన్నవోలు గ్రామంలోని ఓ ఇంటి టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో ప్రమాదం తప్పింది. తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి తదితరులు పరిస్థితులను సమీక్షించారు.


కోట: గోవిందపల్లిపాళెం వద్ద బంగాళాఖాతంతో కలిసి పొంగుతున్న స్వర్ణముఖి, చల్లకాలువ, ఉప్పుటేర్లు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా బుధవారం మీడియాతో మాట్లాడారు. తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాల్లో చేర్చామని తెలిపారు. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారజామున వాయుగుండం తీరం దాటే అవకాశం ఉన్నందున భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. అత్యవసర సమయంలో మండల కేంద్రాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని చెప్పారు. గూడూరు డివిజన్ కేంద్రంలో 08624-252807, 70134 83056, చిల్లకూరు 99895 02067, కోట 99895 02068, వాకాడు 81421 00824, చిట్టమూరు 99899 32809, బాలాయపల్లి 70360 05230, వెంకటగిరి 86252 95044, డక్కిలి 79934 64307 నంబర్లు సంప్రదించవచ్చని తెలిపారు.

కలవకూరు వద్ద పెరిగిన ప్రవాహం

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం కలవకూరు వద్ద స్వర్ణముఖి నదికి వరద ప్రవాహం రెట్టింపైంది. ఇక్కడ పాలచ్చూరు ఆనకట్టపై ప్రవాహం పెరగడంతో రాకపోకలు ఆగిపోగా రోడ్డుకు రెండు వైపులా అడ్డుగా ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. అధికారులు నిఘా ఏర్పాట్లు చేపట్టారు. అటు కాళహస్తి నుంచి నాయుడుపేట పారిశ్రామికవాడకు ఉద్యోగాల కోసం రాకపోకలు చేసే కార్మికుల అవస్థలు వర్ణనాతీతం. పాలచ్చూరు-నాయుడుపేట మార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. పాలచ్చూరు వాసుల రాకపోకలకు ఇబ్బంది కాగా నాయుడుపేటకు గురప్పతోట మీదుగా వెళ్లాల్సి ఉంది. శ్రీకాకుళం వలస కార్మికులు 20 మందికి రెవెన్యూ యంత్రాంగం పునరావాసం కల్పించారు.


దొరవారిసత్రం: వెదురుపట్టు మార్గంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పాలకాలువ

రైతుల అవస్థలు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: ఏకొల్లు, పూలతోట, సింగనాలత్తూరు, కల్లూరు, నేలపట్టు, మైలాంగం, నెల్లూరుపల్లి తదితర గ్రామాల్లో ఉన్న పంట పొలాల్లో నీరు నిండుగా నిలిచింది. నారుమడులు, నాలుగైదు రోజుల క్రితం పైరు మొలిచిన పొలాల్లోని నీటిని రైతులు బయటకు పంపేందుకు అవస్థలు పడుతున్నారు. కల్లూరు, కల్లూరుకండ్రిగ, సూరపుఅగ్రహారం, ఉచ్చూరు, ఆనేపూడి తదితర గ్రామాల్లో సాగుచేసిన కూరగాయల పంటలకు ఈ వర్షం కొంతమేరా నష్టం చేకూర్చినట్లు రైతులు తెలిపారు.

● కాళంగినది, కన్నాకాలువ, పాలకాలువ, కట్టువాపల్లికాలువ, నెర్రికాలువ తదితర ప్రాంతాల వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శైలకుమారి సూచించారు. కొత్తపల్లి, పూలతోట తదితర ప్రాంతాల్లో ఉన్న కన్నాకాలువను ఆమె పరిశీలించారు. దొరవారిసత్రం, మినమనూడి, అయ్యాపాలెం, పోలిరెడ్డిపాలెం తదితర గ్రామాల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలను ఎస్సై అజయ్‌కుమార్ పరిశీలించారు. నీరు నిండిన బ్రిడ్జిల్లోకి వాహనాలు వెళ్లకుండా పోలీసు సిబ్బందిని పహారా ఉంచారు.


కోట: విద్యానగర్‌లో జల దిగ్బంధంలో పశువైద్యశాల


సూళ్లూరుపేట: కోళ్లమిట్టలో నీటిని బయటకు పంపుతున్న పుర సిబ్బంది


దొరవారిసత్రం: కాళంగి నదికి వరద పెరగడంతో రాకపోకలు నిలిపివేసిన తహసీల్దారు శైలకుమారి, ఎస్సై అజయ్‌కుమార్ తదితరులు


వెంకటగిరి: ధర్మాపురం కాలువలో వ్యర్థాల తొలగింపు


దొరవారిసత్రం: మేలచాలత్తూరు వద్ద ప్రమాదకరంగా చెరువు కట్ట


సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డులో పొక్లెయిన్‌తో నీరు వెళ్లేందుకు కాలువ తవ్వకం

తీర ప్రాంతాల్లో భయం భయం

కోట, న్యూస్‌టుడే: కోట మండలం కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం, వావిళ్లదొరువు, జంగిటవానిదిబ్బ తదతర గ్రామాల సమీపంలోని బంగాళాఖాతం, స్వర్ణముఖి, చల్లకాలువ, ఉప్పుటేర్లు కలిసి పారుతున్నాయి. ముఖద్వారం లేనందు వల్ల సమీప గ్రామాలైన పుచ్చలపల్లి, దొరువుకట్టలతోపాటు పలు గ్రామాల పొలాలను ముంపునకు గురి చేసే ప్రమాదం నెలకొంది. దీంతో భయం గుప్పిట్లో గడుపుతున్నారు. గోవిందపల్లిపాళెం మత్స్యకారులు సొంత నిధులతో యంత్రాల ద్వారా ముఖద్వారాలు తవ్వుకొంటున్నారు. గూడలి వద్ద స్వర్ణముఖిలో సాగునీరు కొంత మేరకు చేరింది. కాలువలు పారుతున్నాయి. దాతల దాతృత్వంతో కోటలో 21 మంది నిరాశ్రయులకు భోజనాలు అందజేశారు. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, ఎస్సై పవన్‌కుమార్ పలుశాఖల అధికారులు, ఎంపీటీసీలు గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు.

27 కుటుంబాలకు వసతి

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం సాయత్రం వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని తహసీల్దార్ రామయ్య పేర్కొన్నారు. మండలంలో 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా తూపిలిపాలెం కేంద్రంలో 27 మంది గిరిజన కుటుంబాలను చేర్చి వసతులను కల్పించారు. బాలిరెడ్డిపాలెం స్వర్ణముఖి నది పొర్లుకట్ట వద్ద నదికి వరద వచ్చింది. వాకాడులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలకు కష్టాలు తప్పలేదు.


తడ పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం

బాలాయ‘పల్లెల్లో’..


బాలాయపల్లి: హస్తకావేరి తోటలో ఉంటున్న వారిని పలకరిస్తున్న ఎంపీడీవో వినీల్‌కుమార్ తదితరులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: కైవల్యా నది ప్రవహిస్తోంది. అంబలపూడి, హస్తకావేరి, కామకూరు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. హస్తకావేరి తదితర గ్రామాల్లో శివారుల్లోని ఇళ్లకు ఎంపీడీవో వినీల్‌కుమార్ వెళ్లి ఆరాతీశారు. వెంకటరెడ్డిపల్లి-నిండలి మధ్య కైవల్యా కాజ్‌వే పొంగే అవకాశాలు ఉన్న దృష్ట్యా ఈ మార్గంలో రాత్రిళ్లు రాకపోకలు సాగించడం సరికాదని ఎస్సై గోపి హెచ్చరించారు.

ఆ గ్రామాల్లో రెండ్రోజులుగా అంధకారం

మన్నూరు, పల్లిపాడులో రెండ్రోజులు విద్యుత్ సరఫరా లేదు. స్థానిక ఉపకేంద్రం నుంచి గొట్టికాడు ఫీడర్‌లో సరఫరా కొనసాగాల్సి ఉంది. ఈ కారణంగా తాగునీటి పథకాలకూ మోటార్లు తిరగక నీటి సమస్య ఏర్పడింది.

10 బస్సులు నిలిపివేత

వెంకటగిరి డిపో పరిధిలో పది బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు డీఎం రామకృష్ణ తెలిపారు. 3 బడి బస్సులతో పాటు నాయుడుపేట, గూడూరు మార్గాల్లో మరో ఏడింటిని కుదించామన్నారు. వెంకటగిరి నుంచి ముచ్చివోలు మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే సర్వీసులను ఏర్పేడు మీదుగా మళ్లించగా.. చిననపేట మార్గంలో వాగులు పొంగుతుండటంతో తిప్పడం లేదన్నారు. మరో వైపు శ్రీకాళహస్తి నుంచి కలవకూరు మీదుగా బాలాయపల్లి మండలం పెరిమిడి మధ్య తిరిగే బస్సు సర్వీసులను మధ్యలో వాగుల ఉద్ధృతి వల్ల శ్రీకాళహస్తి డిపో అధికారులు రద్దు చేశారు.

వైద్య శిబిరం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: తిమ్మాజీకండ్రిగలో బుధవారం వసంత లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో తల్లులు, పిల్లలకు వైద్య పరీక్షలు చేసి పోషకాహారం కిట్లను అందించారు. వైద్యులు మాల్యాద్రి, దీప్తి, సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.25 వేలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: శ్రీరామరక్ష కుటీర నిర్వాహకులు సీఎం సహాయ నిధికి రూ.25 వేలు చెక్కును బుధవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కి అందజేశారు. కుటీర నిర్వాహకులు చిట్టిబాబు, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966

సమయం 10 AM TO 1 PM

పెళ్లకూరు, న్యూస్‌టుడే:

సమస్య: పెళ్లకూరు మండలం కలవకూరు ఎస్సీ కాలనీలో వీధులు అధ్వానంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో విషపురుగుల సంచారంతో భయపడుతున్నాం.

–నెలబల్లి నాగరాజు, స్థానికుడు

సమాధానం: పంచాయతీ ద్వారా వీధులు శుభ్రం చేయిస్తాం. మధుమోహన్‌దాస్, పంచాయతీ కార్యదర్శి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: గూడూరు రెండో పట్టణం జానకీరామ్‌పేట ప్రాంతంలో కాలువలో మురుగు ముందుకు కదలడం లేదు.

– చందు, గూడూరు

సమాధానం: సిబ్బందితో పూడిక తీయిస్తాం. కాలువలను పునరుద్ధరిస్తాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్

కంప చెట్ల తొలగింపు

స్పందనకు వందనం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: పెరిమిడి-బొల్లవారిపాళెం మార్గంలో ర.భ. రహదారికి ఇరువైపులా కంప చెట్లను ఆ శాఖ ఏఈ డాక్టర్ బాబు తొలగించారు. ఈ నెల 2న ‘ఈనాడు’లో ‘మేమున్నాం.. మీకు తోడుగా’ శీర్షికన ఈ సమస్యను ప్రచురితమైన సంగతి తెలిసిందే.


కలవకూరు వద్ద డ్యామ్‌పై వరద ప్రవాహం


కలవకూరు-ముమ్మారెడ్డిగుంట మార్గంలో నిలిచిన రాకపోకలు


తడ: తడకండ్రిగ వద్ద ముంపులో పంటలు